

# పొలంబడి

వ్యవసాయ శ్రమనూ, ఖర్చునూ తగ్గించేందుకు ఎన్నో యంత్ర పరికరాలు తయారవుతున్నాయి. వాటి వినియోగం, అందులోని మెలకువలు నేర్చుకోవడంలోనే రైతులకు ఇబ్బంది తలెత్తుతోంది. యంత్రాల ఎంపిక నుంచి వినియోగం, బాగుచేత దాకా వివిధ విషయాల మీద రైతులకు శిక్షణ ఇచ్చేందుకు మన దగ్గరే పెద్ద సంస్థ ఉంది. అనంతపురం దగ్గర్లో ఉన్న ఈ సంస్థలో సాగులోని మెలకువలూ నేర్పుతారు.





వర్షాలు పడకపోవడం, గిట్టుబాటు ధరలు రాకపోవడం, పెట్టుబడి వ్యయం పెరిగిపోవడం... కారణమేదైనా కావచ్చు, సమాజానికి వెన్నెముకలాంటి రైతుకు పంటసాగు కష్టాల సాగే అవుతోంది. అయితే తక్కువ పెట్టుబడి, పరిమిత నీటి వాడకం, పంటసాగులో యంత్రాల వినియోగం నేర్పుతూ... ఇలా సాగుబడి చేస్తే వ్యవసాయమూ కాసుల్ని కురిపిస్తుందంటుందీ పొలంబడి. అదే అనంతపురం జిల్లా గార్లదిన్నెలోని ట్రాక్టర్ నగర్, దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్ర శిక్షణ పరిరక్షణ సంస్థ. గత మూడు దశాబ్దాలుగా కొన్ని వేల మందిని వ్యవసాయ సాంకేతికతలో మెరికల్లా తీర్చిదిద్దుతోంది.

### ఏ యంత్రం ఎక్కడ...

యాంత్రీకరణ వల్ల వ్యవసాయ పెట్టుబడుల్లో పొదుపూ, దిగుబడుల్లో పెరుగుదలా సాధ్యమన్నది తెలిసిందే. అయితే ఏ యంత్రాన్ని ఎక్కడ ఎలా వాడాలి, మనం పండించే పంటలకు తగ్గట్టు ఏయే యంత్రాలు అందుబాటులో ఉంటాయి, వాటి వాడకం వల్ల ఎంత వరకూ లాభం పొందొచ్చు లాంటి అనేక కోణాల్లో రైతులకూ, యంత్రాల వినియోగదారులకూ ఉత్పత్తిదారులకూ, సాంకేతిక విద్యార్థులకూ పాఠాలు చెబుతారిక్కడ. 185 హెక్టార్ల సువిశాల ప్రాంగణంలో ఉన్న ఇందులో కొంత మేర వ్యవసాయం జరుగుతూ ఉంటుంది. ఇక్కడ చేరిన ఎవరైనా పంట సాగుబడిలో మెలకువలనూ యంత్రాల వాడకాన్నీ ప్రత్యక్షంగా చూసి నేర్చుకోవచ్చు. వ్యవసాయ విజ్ఞానం (అగ్రికల్చర్‌సైన్స్) చదివే విద్యార్థులకు ఇక్కడ ప్రయోగాత్మక శిక్షణ ఇస్తున్నారు. నిరక్షరాస్యులైన వారి నుంచి డాక్టరేట్ చేసిన వారి వరకూ ముందస్తుగా దరఖాస్తు చేసుకున్న ఎవరైనా ఇక్కడ శిక్షణ తీసుకోవచ్చు.

### తరగతులు ఉచితమే...

ట్రాక్టర్‌నగర్ సంస్థ సాగుకు సంబంధించి విభిన్న తరగతులను అందుబాటులోకి తెస్తోంది. ఇతర జిల్లాలూ, రాష్ట్రాల నుంచి వచ్చే వారికి భోజన, వసతి సదుపాయమూ ఉంది. నిరంతరం ఇక్కడ శిక్షణా కార్యక్రమాలు జరుగుతూనే ఉంటాయి. తరగతులు వారం వ్యవధి ఉన్నవి మొదలు నెలల వరకూ సాగేవి ఉంటాయి. ఆధునిక వ్యవసాయంలో శక్తి వినియోగం అంశంలో నాలుగు వారాల శిక్షణ ఇస్తే, వివిధ రకాల వ్యవసాయ యంత్రాల ఎంపికా, వినియోగించే విధానమూ, నిర్వహణా, తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి ఆరు వారాల పాటు శిక్షణ ఇస్తోంది. మహిళా రైతులకు శ్రమను తగ్గించాలన్న భావనతో తేలికైన వ్యవసాయ పనిముట్ల వాడకం గురించి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. బిందు, తుంపర సేద్యాల్లో మెలకువలు నేర్పుతున్నారు. అలాగే సస్య రక్షణ పరికరాల ఎంపిక, ఉపయోగించే విధానం చెబుతారు. చేతి పంపుల ఎంపిక, వాడకంలోనూ శిక్షణనిస్తారు. అంతేకాదు పప్పులూ, నూనె ధాన్యాల పంటల ఉత్పత్తిలో వినియోగించే వివిధ యంత్రాల ఎంపికా, వాటి నిర్వహణా, మెట్ట సేద్యంలో యంత్రాల ఎంపికా వినియోగాలపైనా తరగతులు నిర్వహిస్తున్నారు. ఇవన్నీ పూర్తిగా ఉచితం. సాంకేతిక అంశాల విభాగంలో... ట్రాక్టర్లు, డీజిల్ ఇంజిన్ల మరమ్మతుల మీదా, పవర్ టిల్లర్ల మరమ్మతుల గురించీ శిక్షణ ఇస్తున్నారు. ఆటో ఎలక్ట్రికల్ పరికరాలూ, బ్యాటరీ బాగుసేత, వ్యవసాయ యంత్రాలు హైడ్రాలిక్ పద్ధతులు, నేలను చదును చేసే యంత్రాలూ, బుల్‌డోజర్ల యాజమాన్యంపైనా విద్యార్థులకు నామమాత్రపు రుసుముతో బోధనా తరగతులు నిర్వహిస్తారు. పదోతరగతి, ఐటీఐలు చదివిన వారూ ఇక్కడ శిక్షణ పొందొచ్చు. యంత్రాల ఉత్పత్తిదారులూ, డీజిల్ మెకానిక్కులకూ శిక్షణ ఇవ్వడంతో పాటూ డిగ్రీ, డిప్లొమా విద్యార్థులకూ వివిధ అంశాల్లో నెలరోజుల శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరికీ సంబంధిత సర్టిఫికెట్‌ను అందజేస్తారు. సంస్థ నాణ్యతా ప్రమాణాల పరంగా జాతీయ స్థాయి ధృవీకరణ(ఐఎస్ఓ) కూడా పొందింది. ఇక, ఎవరైనా తమ ఊరివాళ్లకు శిక్షణ కావాలి అని ఫోన్ చేసినా, ఉత్తరం రాసినా సిబ్బంది ఆ ఊరికి వెళ్లి మరీ తరగతులు చెబుతారు.

### మొత్తం నాలుగే...

ఇలాంటి సంస్థలు దేశం మొత్తం మీద నాలుగే ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో ఇదొక్కటే కాగా మధ్యప్రదేశ్ బుదినిలో ఒకటి, హరియాణాలోని హిస్సార్‌లో మరొకటి, అసోంలోని బిశ్వనాథ్ చెరలిలో ఇంకొకటీ ఉన్నాయి. వ్యవసాయ యంత్రమేదైనా మార్కెట్లోకి రావాలంటే ఈ సంస్థ ధృవీకరణ తప్పనిసరి. ఇక్కడ శిక్షణ పొందాలనుకున్నవారు www.srfmtti.dacnet.nic.in లేదా email: fmtlsr@nic.inల ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తానికి ఈ పొలంబడిలోకి వెళితే రైతన్న సాగుబడిలో గట్టెక్కిపోతాడన్నమాట!

*– పునికిలి హరగోపాలరాజు, ఈనాడు, అనంతపురం*

సహకారం: జి.రామ్మోహన్, గార్లదిన్నె



EENADU; 14TH MAY, 2017